కర్త, కర్మ, క్రియ

ఇప్పుడతను ఇరకాటంలో పడ్డాడు. వనజ పంపిన అర్జీ కాగితాన్ని బుట్టదాఖలు చెయ్యనూ లేదు, దానిమీద చర్య తీసుకోనూ లేదు. డైరెక్టర్ జనరల్‌కి నేరుగా అర్జీ పెట్టుకుని దాని కాపీని డైరెక్టర్‌కి పంపించింది వనజ. అయితే గత సంవత్సరం పొడుగునా వనజ చాలా అర్జీలు పెట్టుకుంది డైరెక్టర్ జనరల్‌కి- తనకి న్యాయం చేకూర్చమనీ, తనకి ఆఫీసులో డైరెక్టర్ చేతుల్లో జరిగే చిత్రహింస ఆపు చేయవలసిందనీను. ప్రతి అర్జీతో బాటూ డైరెక్టర్ గౌరీశంకర్‌కి వనజ మీద కక్ష మరింత ఎక్కువైందే గాని తగ్గలేదు.

మొట్టమొదటిసారి- అంటే సంవత్సరం క్రితం వనజ ధైర్యంచేసి డైరెక్టర్ జనరల్ సారథికి తనకి జరిగిన అన్యాయాన్నంతా పూస గుచ్చినట్లు వ్రాసింది. తనకు రావలసిన ప్రమోషను తనకు రాకుండా చెయ్యటం ఇది రెండవసారి అనీ, మొదటిసారి డైరెక్టర్ అతని కిష్టమైన ఒకతన్ని పైనుంచి వచ్చినవాణ్ణి సెలెక్ట్ చేశాడనీ, ఈసారి అతని కులం వాడని చెప్పి తనకన్న రెండేళ్లు జూనియర్ అయిన వాడిని సెలక్ట్ చేశాడనీ, తనకున్న ఆరు సంవత్సరాల అనుభవాన్ని కాదని అనుభవం లేని

వాడిని పైకి ప్రమోట్ చెయ్యటం అన్యాయం అనీ, ఇదంతా చేసింది చాలక తన సెక్షను మార్పించి ఆ సీనియర్ పోస్టుకి కొత్తగా సెలక్టయిన తన జూనియర్ క్రింద పని చెయ్యమని ఆదేశించాడనీ, ఈచర్య మానసికంగా చాలా క్రూరమయినది కాబట్టి తనకి జరిగిన అన్యాయాన్ని సరిచేయవలసిందనీ డైరెక్టర్ జనరల్‌కి వ్రాసింది వనజ.

గౌరీశంకర్ సారథిని ఏదో పనిమీద కలుసుకున్నప్పుడు 'ఈ వనజ సంగతేమిటి? ఏం జరిగింది?' అని సారథి ఆరా తీశాడు. గౌరీశంకర్ చాలా తేలిగ్గా కొట్టిపారేశాడు. ఆ వనజకి తెలివితేటలు శూన్యమనీ, ఏ బాధ్యత అప్పగించినా సక్రమంగా నిర్వర్తించలేదనీ, లేకపోతే తాను మాత్రం పరాయివాణ్ణీ, జూనియర్నీ ఎందుకు సెలక్టు చేస్తాననీ, తనేకాక సెలక్షన్ బోర్డు అంతకీ వనజ మీద సదభిప్రాయం కలగలేదనీ చెప్పి, 'సెలెక్టు కాకపోవటం వనజ కర్మ! ఆ సంగతి నా కొదిలెయ్యండి. నేను చూసుకుంటాను' అన్నాడు తొణక్కుండా. గౌరీశంకర్ చాలా పేరు మోసిన డైరెక్టర్. తెలివైనవాడూ, చురుకైనవాడూ. ఎన్నో క్లిష్టమైన ప్రాజెక్టుల్ని విజయవంతంగా సాధించినవాడూ అని డైరెక్టర్ జనరల్ సారథికి తెలుసు. సరేనని ఊరుకున్నాడు వనజ విషయంలో.

మళ్ళీ నెల రోజులు తిరక్కుండా వనజ దగ్గర్నుంచి మరొక అర్జీ వచ్చింది సారథికి. అతను నొసలు చిట్లించాడు. 'నెలరోజులు తిరక్కుండా మళ్ళీ మీకు అర్జీ పెట్టుకోవలసి రావటం నా దురదృష్టం. నెల రోజులు కూడా ఆ కొత్తసెక్షన్‌లో నన్ను పనిచెయ్య నివ్వకుండా, నా కొత్త సెక్షన్ హెడ్ చేత (ఇంతకు ముందు నా జూనియర్) నా పని తృప్తికరంగాలేదని రిపోర్టు రాయించారు డైరెక్టర్. నేను ఇక్కడ చేరిన తరవాత ఆరు సంవత్సరాలుగా ఒకే సెక్షన్‌లో పనిచేశాను. అందులో

అనుభవం సంపాదించాను. మరొక సెక్షన్‌లో పని ఆకళింపు చేసుకోవ టానికి అధమం నెలరోజులైనా పట్టదా? ఈ నెలలోగానే నా పని అసం తృప్తికరంగా ఉందని రిపోర్టు రాయించి నన్ను మరో సెక్షన్‌కి బదిలీ చేయించటంలో సబబు ఏమైనా ఉన్నదేమో ఆలోచించండి. ఈ విధంగా నా రికార్డు పాడుచేసి నన్ను కావాలని హింసించటం ఎందుకో దయచేసి విచారించవలసిందని ప్రార్థిస్తున్నాను' అని మొరపెట్టుకుంది వనజ. సారథి ఈ సారి తనని కలుసుకుని మాట్లాడవలసిందని వనజకి ఉత్తరువు జారీ చేశాడు. వనజ వెళ్లి మాట్లాడింది సారథితో.

కొంతమంది వందిమాగధులు వెళ్లి గౌరీశంకర్‌తో ఈ సంగతి చెప్పారు. విని మండి పడ్డాడతను. 'వెడుతుంది వెడుతుంది. ఇవాళ డైరెక్టర్ జనరల్ దగ్గరికి వెళ్లింది, రేపు మినిస్టర్ దగ్గరికి వెడుతుంది. దానికేం, పచ్చి భోగంది' అన్నాడు కోపం పట్టలేక. ఇలా తిట్టాడని కొందరు వెళ్లి వనజ చెవిలో ఊదారు. వనజ గుండె భగ భగ మంది. ఆమె సీతా మహాదేవి కాదు, అమాంతం అవమాన భారంతో భూమిలో కుంగి పోవటానికి. అలాగే స్థిరంగా నిలబడి మనస్సు రాయి చేసుకుంది. ఆ దెబ్బతో రాజీనామా ఇస్తుందేమో, ఒక పోస్టు అయినా ఖాళీ అవుతుందని ఆశించిన కొలీగ్స్ కొందరు నిరుత్సాహపడి, 'మొండి ఘటం' 'సిగ్గులేదు' అని గొణుక్కున్నారు. వనజకి అన్యాయం జరిగిందని నమ్మిన ఏ కొద్ది మందో ఉన్నప్పటికీ, డైరెక్టర్‌కి అప్రియులవుతారన్న భయంతో వనజకి దూరంగా ఉండేవారు కొందరు. వనజతో కలిసి కాఫీ తాగటానికి కాంటీనుకి వెళ్లే ఇద్దరు ముగ్గుర్ని పిలిచి గౌరీశంకర్ హితబోధ చేశాడు-'అది తుచ్ఛు రాలు. దానితో తిరిగితే మీకు ఒరిగేదేమిటి? మీమీద నాకెన్నో ఆశలు

న్నాయి. శ్రద్ధగా పనిచెయ్యండి. మీకు మంచి పొజిషన్స్ వస్తాయి' అని అభయం కూడా ఇచ్చాడు.

ఏదో కొత్త ప్రాజక్టు విషయం చర్చించటానికి ఓ రోజున గౌరీ శంకర్ వనజ పనిచేస్తున్న సెక్షన్ వాళ్లందర్నీ తనగదిలోకి రమ్మని కబురంపించాడు. వనజని చూడగానే డైరెక్టర్ ముఖం చిట్లించి, 'సెక్షనంతా ఖాళీచేసి వస్తే అక్కడ పనెవరు చూస్తారు? నువ్వెళ్లి నీపని చూసుకో' అన్నాడు. అందరూ తెల్లబోయారు ఆ ధోరణికి. వనజ అర క్షణం నిర్ఘాంతపోయినా, అంతలోనే ధైర్యం తెచ్చుకుని, 'కొత్త ప్రాజక్టు గురించి చర్చించటానికి మా సెక్షన్‌లో అందర్నీ రమ్మని కబురంపించారు మీరు. సెక్షన్‌లో నేనూ ఒకర్తెనే. నేనూ ఆ ప్రాజక్టు గురించి తెలుసుకోవలసిన అవసరం ఉంది' అంది తల ఎత్తి సూటిగా గౌరీశంకర్ కళ్లలోకి చూస్తూ.

'తెలుసుకుని నువ్వుచేసే నిర్వాకం ఏమీలేదు. నేను వెళ్లమంటున్నాను-వెళ్లు' అన్నాడు గౌరీశంకర్. కోపంతో అతని గొంతూ, అతని వేళ్లూ వణికాయి. వనజ మరింత ధైర్యం తెచ్చుకుంది. 'నేను వెళ్లను' అంది మొండిగా. డైరెక్టర్ మరింత కోపంతో గుప్పెళ్లు బిగించి టేబుల్ మీద గుద్దుతూ 'నువ్వుండగా నేను చస్తే ఆ ప్రాజక్టు గురించి మాట్లాడను. మీరంతా వెళ్లొచ్చు' అన్నాడు సెక్షన్ హెడ్ వైపు చూస్తూ. అందరూ తలలు వంచుకుని గదిలోంచి ఇవతలికి వచ్చేశారు.

అందరికీ అతని ప్రవర్తన చాలా అసమంజసంగా ఉందని అనిపించింది. కానీ ఒక్కరూ ఆ మాట పైకి అనలేదు. ఒకళ్లిద్దరు మాత్రం సాయంకాలం వనజ ఇంటికివెళ్లి బాగా పురెక్కించారు. 'ఏమైనా సరే, మీరు ఊరుకుంటే లాభం లేదు వనజగారూ, ఆ గౌరీశంకర్ తిక్క–

కుదర్చవలసిందే. మీరు సారథిగారికి మరింత ఘాటుగా రాయండీసారి' అని సలహా ఇచ్చారు.

వనజకి గతమంతా మనస్సులో మెదిలింది. తను ఈ ఆఫీసులో చేరిన తరవాత ఒక సంవత్సరం ఎంతో ఉత్సాహంగా గడిచింది. ఎంతో దీక్షగా మనస్ఫూర్తిగా పని చేసేది. ప్రతి పనినీ శ్రద్ధతో గమనించి డైరెక్టర్ గౌరీశంకర్ తనని అభినందించేవాడు. తనంత అదృష్టవంతురాలు లేదని మురిసిపోయింది. రెండో సంవతర్సం నుంచీ తన పాట్లు ప్రారంభమయ్యాయి. తను చేసే పనిని మెచ్చుకోవటం మానేసి తనని మెచ్చుకోవటం మొదలుపెట్టాడు. మొదట్లో 'ఈ చీర నీకు బాగుంద'నీ, 'ఈ రంగులో మెరిసి పోతున్నావ'నీ అంటూ కామెంట్ చేసేవాడు. రెండు మూడుసార్లు స్త్రీ సహజంగా సిగ్గుపడింది. తరవాత తరవాత అర్థం చేసుకుని తక్షణంగా చూసి తలవంచుకునేది. అటువంటి ధోరణి తనకి నచ్చదన్న భావం కన్నుల్లో సుస్పష్టం చేసింది. క్రమంగా అతనికి 'చెయ్యి వాటుతనం' ఆరంభమయింది. ఏ కాగితాలు ఇచ్చేటప్పుడో కావాలని చెయ్యి తగిలించటం మొదలు పెట్టాడు. ఎంత జాగ్రత్తపడినా ఎలాగో తగిలేచ్చేవాడు.

ఓ రోజున పిల్చి 'నీతో ఒక విషయం మాట్లాడాలి' అన్నాడు గంభీరంగా.

'ఏమిటి చెప్పండి' అంది వనజ నమ్రతగా.

'ఇక్కడ కాదు, పర్సనల్ విషయం. ఇంకెక్కడయినా కలుసుకుందాం. నీకెప్పుడు వీలవుతుందో చెప్పు' అన్నాడు.

వనజ గుండె దడదడలాడింది. అదే సంకేతంగా తీసుకుని, ధైర్యం కూడ దీసుకుని 'నాతో అంత రహస్యంగా మాట్లాడవలసిన వేమున్నాయ్? మాట్లాడేదేదో ఇక్కడే మాట్లాడండి' అంది.

ఈ లోపల ఎప్పుడు చెయ్యి ముందుకి చాచాడో తెలియదు. హఠాత్తుగా వనజ వేళ్ళమీద అతని వేళ్ళు స్పృశించాయి. షాక్ కొట్టినట్లు వెనక్కి లాక్కుని కుర్చీలోంచి లేచింది. 'క్షమించండి. మీరనుకునే రకం మనిషిని కాదు నేను' అని చరచరా ఇవతలి కొచ్చేసింది.

అప్పటినుంచి మొదలైంది గౌరీశంకర్‌కి వనజంటే మంట. ప్రతి పనినీ ప్రత్యేకంగా పరిశీలించి విమర్శించటం మొదలు పెట్టాడు. వనజకి ఒక్కొక్కప్పుడు రాజీనామా ఇవ్వాలన్నంత ఉద్రేకం కలిగేది. కానీ, తన మీద ఆధారపడ్డ తల్లినీ, తమ్ముణ్ణీ తలుచుకుని దుఃఖాన్ని దిగమింగుకుని పనిలో నిమగ్నమయేది. ఒకోసారి తనని తానే సమాధాన పరుచుకునేది-ఆడదానికి ఎక్కడికి వెళ్లినా ఇంతేకదా, ఈ అధికారి కాకపోతే మరొక అధికారి! ఆత్మరక్షణ చేసుకోగల స్తోమత, ఎక్కడయినా సర్దుకుపోగల తత్త్వం ఉండాలి గాని, ఆఫీసు మారినంత మాత్రాన మనుషుల నైజగుణాలు మారుతాయా-అనుకుని ఒక విధమయిన నిర్లిప్తత అలవరచుకుంది. అయిదు సంవత్సరాలు అలాగే గడిపింది.

ప్రమోషన్ రావలసిన సమయం ఆసన్నమైంది. సీనియర్ పోస్టులు రెండు కొత్తగా ఏర్పడ్డాయి. ఎడ్వర్‌టైజ్ చేశారు. మొదటిసారి తనూ మరి కొందరితోపాటు అప్లై చేసింది. ఇంటర్వ్యూలో తను నెగ్గలేదు. పైనుంచి ఎవరో కొత్తమనిషిని సెలెక్టు చేశారు. కొంచెం బాధపడి ఊరుకుంది. రెండో పోస్టుకి ఎడ్వర్‌టైజ్ చేసినప్పుడు తనుఅంతగా

పట్టించుకోలేదు. ఇక ఆఖరి రోజున గౌరీశంకర్ వనజని పిలిచి 'నువ్వు అప్లై చెయ్యలేదేం?' అనిఅడిగాడు. వనజ మాట్లాడకుండా తలవంచుకుంది.

'మాట్లాడవేం? అప్లై చెయ్యమని కూడా బతిమాలించుకోవాలా?' అన్నాడు. గొంతు సౌమ్యంగానే ఉంది. అతన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియక మౌనం దాల్చింది 'ఇవాళ సాయంకాలంలోపుగా అప్లికేషన్ నా చేతికియ్యి. నీ సెక్షన్ వర్క్ గురించి పుస్తకాలు క్షుణ్ణంగా చదువు. బాగా ప్రిపేరయి రావాలి ఇంటర్వ్యూకి తరవాత నన్నని లాభంలేదు అన్నాడు. సరేనని బుర్రఊపి బయట పడింది. అప్పటికే గుసగుసలు ఆరంభమయినాయి వనజ ఇంకా అప్లై చెయ్యలేదని. ఎలాగో సాయంకాలం లోగా అప్లికేషన్ టైప్ చేయించి ఇచ్చింది డైరెక్టరుకి. నెల్లాళ్లపాటు ఇంటర్వ్యూకి కష్టపడి తయారైంది.

ఇంటర్వ్యూలో ఒకాయన మొదట అడిగాడు 'ఏ సెక్షన్‌లో పని చేస్తున్నావ్?' అని. చెప్పింది. ఎన్నాళ్లనుంచి పని చేస్తున్నావని అడిగాడు. 'ఆరేళ్ళనుంచి' అని చెప్పింది. అంతలో డైరెక్టర్ గౌరీ శంకర్ అందుకుని ఫలానా ప్రాజెక్టు ప్రారంభించటంలో గల ఉద్దేశాలేమిటి అని అడిగాడు. తన సెక్షన్‌కి సంబంధించిన ప్రశ్నకాదది. జ్ఞాపకం చేసుకుని కొంచెం తడుముకుంటూ చెప్పింది.

'ఏ ప్రొసెస్ ప్రకారం వేస్టేజ్ తక్కువవుతుంది?' అని అడిగాడు ఆ ప్రాజెక్టు గురించే. వనజ జవాబు చెప్పలేక పోయింది.

'ఆరు సంవత్సరాలనుంచీ ఇక్కడ పని చేస్తున్నావు. నీచుట్టూ ఏం జరుగుతున్నదో తెలుసుకోవాలనే కుతూహలంకూడా లేదన్నమాట అన్నాడు గౌరీశంకర్ నిరసనగా. వనజ ఏదో చెప్పబోయే లోపలే 'ఇహ

నువ్వెళ్లొచ్చు' అన్నాడు. నమ్మలేనట్లుగా తక్కిన సెలక్షన్ బోర్డు మెంబర్ల వైపు చూసింది వనజ. వాళ్ళు గౌరీశంకర్ వైపు చూశారు. అతను 'ఊఁ' అన్నాడు-ఇంకా వెళ్ళవేం-అన్నట్లుగా.

వనజకి కళ్ళనీళ్ళ పర్యంత మయింది. తన సెక్షన్ వర్కు గురించి ఒక్క ప్రశ్నకూడా వెయ్యలేదు. తన అనుభవంతో సంపాదించిన విజ్ఞానాన్ని ప్రదర్శించటానికి ఏమంత అవకాశం కూడా ఇవ్వలేదని పించింది. ఊరుకున్నదాన్ని పిలిచి అప్లై చెయ్యమనీ, సెక్షన్ వర్కు గురించి పుస్తకాలు చదవమనీ ప్రత్యేకం సలహా ఇచ్చిన పెద్ద మనిషి ఇంటర్వ్యూలో అలా కర్కశంగా ఎందుకు ప్రవర్తించాడో అర్థం కాలేదామెకి. ఏదో అన్యాయం జరిగిందని మాత్రం మనస్సు మూలిగింది. ఆరాత్రి అన్నం సయించలేదు. తల్లి ఎంత బ్రతిమాలినా భోజనానికి లేవలేదు. చివరికి తమ్ముడు వచ్చి 'అక్కా, నువ్వు తినకపోతే నేను తినను' అని దీనంగా మొహం పెడితే కళ్ళనీళ్ళు తిరిగి వాడి కోసం పీట మీద కూర్చుని ఏవో నాలుగు మెతుకులు నోట్లోకి తోసింది.

మర్నాడు ఆఫీసులో అందరూ అనుకుంటూంటే అప్పుడర్థమయింది తనకి జరిగిన అన్యాయం ఏమిటో. గౌరీశంకర్ తన కులం వాణ్ణీ, తనకు కావలసిన వాణ్ణీ ప్రమోట్ చెయ్యటంకోసం వనజని కావాలనే ఇంటర్వ్యూలో చిన్న చూపు చూశాడనీ, బోర్డ్ మెంబర్స్‌కి ముందుగానే హింటిచ్చాడనీ అంతా గుసగుస లాడుకున్నారు. 'ఏడు కొండలవాడా, నేనేం పాపం చేశానని నాకీ శిక్ష విధించావు' అని వాపోయింది వనజ.

ఇద్దరు కొలీగ్స్ సాయంకాలం వనజ ఇంటికొచ్చి అయాచితంగా సలహా ఇచ్చారు-'మీరు ఊరుకోకండి. మీకు జరిగింది అక్షరాలా

అన్యాయం. డైరెక్టర్ జనరల్‌కి అర్జీ పెట్టుకోండి. ఈ గౌరీశంకర్ గీర అంతా అణుగుతుంది' అన్నారు.

'ఎందుకొచ్చిన గొడవలెండి. ఏదో నాకర్మ! నాకు ప్రమోషన్ వచ్చే రాతలేదు. ఆయనమాత్రం ఏం చేస్తాడు!' అంది వనజ విరక్తిగా.

'మీరలా సన్యసిస్తే లాభంలేదు వనజగారూ. ఇవాళ మీకు జరిగింది అన్యాయం. రేపు మాకు జరుగుతుంది. మొగ్గలోనే తుంచాలి చీడపడితే గౌరీ శంకర్ మీకు అన్యాయం చేశాడు. మీరు మీకర్మ అనుకుంటే లాభంలేదు. క్రియాపూర్వకంగా మీరతనికి పాఠం నేర్పాలి' అన్నారు వాళ్లు. అని, వాళ్లే ఏమేం రాయాలో కూడా చెప్పి డైరెక్టర్ జనరల్‌కి వనజ చేత అర్జీ పెట్టించారు. కాపీ డైరెక్టర్‌కి వెళ్లింది.

అప్పటి నుంచి మొదలైంది డైరెక్టర్‌తో ప్రచ్ఛన్నయుద్ధం. అదంతా మనస్సులో మెదిలింది వనజకి. డైరెక్టర్ తన సెక్షన్ వాళ్లం దర్నీ కొత్త ప్రాజక్ట్ చర్చించటానికి పిలిచి తన్నొక్కర్తెనీ వెళ్లి పొమ్మ నగానే వనజ మనస్సు కుత కుతలాడింది ప్రతి కక్షతో. ఈ సంగతంతా పూస గుచ్చినట్లు డైరెక్టర్ జనరల్ సారథికి రాసింది. క్రిందటి సారి తను ఆయన్ని కలుసుకున్నప్పటి నుంచీ నలుగురిముందూ తన గురించి ఉచ్చరించరాని నీచమయిన మాటలు మాట్లాడుతున్నారనీ, తనతో కలిసి మెలిసి తిరగొద్దని తన కొలీగ్స్ అందరికీ నూరి పోస్తున్నారనీ, ప్రతి విషయంలోనూ తనని ప్రత్యేకంగా కించపరుస్తున్నారనీ, ఈ చిత్రహింసని అరికట్టవలసిందనీ, లేకుంటే తను ప్రాణత్యాగం చెయ్యవలసి వస్తుందనీ అందుకు బాధ్యత ఎవరిదో తను వివరించనక్కర్లేదనీ ఘాటుగా రాసింది.

సారథి ఈసారి గౌరీ శంకర్‌ని పిలిపించి, 'ఏమిటయ్యా ఇదంతా? ఆ వనజంటే మీకెందుకీ కక్ష?' అన్నాడు నవ్వుతూనే. గౌరీశంకర్ కూడా అదేదో జోక్ అయినట్లుగా పకపకానవ్వేసి 'ఏమిటండీ మీరు కూడా అదే మాటంటారు! అధికారుల మన్న తరవాత ఇలాంటి వాళ్లనెంత మందినో ఎదుర్కోవాల్సి వస్తుంది. చాకులాంటి యువకుల్ని సంస్థలోకి తీసుకు రావాలనీ, సంస్థని వృద్ధి చెయ్యాలనీ, దేశ సౌభాగ్యానికి పాటుపడాలనీ మీరే ఉపన్యసిస్తూంటారు కదా! వనజలాంటి మొద్దమ్మల్ని పైకి తీసుకొచ్చి బాధ్యతలప్పగిస్తే ఇంక పనులేం సాగుతాయి ముందుకి!, అన్నాడు.

నేనా అమ్మాయితో మాట్లాడిచూశాను. బుద్ధిమంతురాలిలాగే ఉంది. తెలివైన దానిలాగే తోచింది' అన్నాడు సారథి గౌరీ శంకర్ మాటల్ని నమ్మలేనట్లు ముఖం పెట్టి.

'ఆ, పైపై మెరుగులు చూసి మోసపోకూడదండీ. కాకపోయినా, ప్రతి చిన్న విషయానికీ నన్ను కాదని మీదగ్గరకి పరుగెత్తుకొస్తూంటే ఇహ నా ఆఫీసులో క్రమశిక్షణ ఏముంటుంది? నా సంస్థకి మంచేదో చెడేదో నాకా మాత్రం తెలియదా?' అన్నాడు గౌరీశంకర్ బింకంగా.

నిప్పు లేకపోతే పొగ ఎందుకొస్తుంది-అని మనస్సులో అనుకుని సారథి పైకి మాత్రం 'ఏమైనా, ఇకముందైనా ఇలాంటివి జరక్కుండా చూసుకోండి గౌరీ శంకర్ 'అని మర్యాదగా మందలించి ఊరుకున్నాడు.

వనజని పిలిపించి ఆ అమ్మాయికి కూడా కొంత ఉపదేశం చేశాడు సారథి. 'అమ్మాయ్! అధికారి అన్నతరవాత కొన్ని నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది సంస్థ మంచీచెడూ ఆలోచించి. అందులో ఎవరికో ఒకరికి ఎప్పుడో ఒకప్పుడు అన్యాయం జరిగినట్లు అనిపించక మానదు.

కొంచెం అర్ధం చేసుకోవటానికి ప్రయత్నించు. గౌరీశంకర్‌కి నీమీద ఏదో ప్రత్యేకమయిన కక్ష ఉందని భ్రమించి అనవసరంగా మనస్సు కలుషితం చేసుకోకు. నీ సామర్ధ్యమే దెబ్బతింటుంది. శ్రద్ధగా నీపని నువ్వు చూసుకో. నీకేవిధమయిన అన్యాయం జరక్కుండా నేను చూస్తాను' అని అప్పటికి అభయమిచ్చి పంపించాడు డైరెక్టర్ జనరల్.

ఆరు నెలలు కాస్త ప్రశాంతంగా జరిగిపోయాయి. గౌరీ శంకర్ కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకునీ, నోరుకట్టుకునీ వనజని పట్టించుకోనట్లు నిర్ల క్ష్యంగా మాత్రం ఉంటూ వచ్చాడు ఈ లోపల ప్రసాద్ అనే అతను స్వంతంగాస్కాలర్‌షిప్ సంపాదించి జర్మనీ వెళ్ళాడు ట్రెయినింగ్‌కోసం. అతను జర్మనీనుంచి రాసిన ఉత్తరాలు చూసి అతను చేస్తున్న కృషికి గౌరీ శంకర్ ముగ్ధుడై పోయి అందరితోనూ ప్రసాద్ గురించి గర్వంగా చెప్పటం మొదలు పెట్టాడు. అతను జర్మనీనుంచి తిరిగి వచ్చినప్ప ట్నుంచీ, అతను వనజతోటివాడే అయినా అతన్ని సీనియర్ ఆఫీసర్ లాగ చూడటం అరంభించాడు గౌరీశంకర్.

కొద్ది రోజులకే ఒక సీనియర్ ఆఫీసర్ రెండు నెలలు సెలవు పెట్టాడు. ఆ సెలవు సమయంలో ప్రసాద్‌ని ప్రమోట్‌చేసి అతన్నిసెక్షన్ హెడ్‌గా చెయ్యాలని గౌరీశంకర్ ఆలోచించాడు. ఇలా జరగొచ్చునని ముందుగానే ఊహించి వనజ శ్రేయోభిలాషులు వనజకి సలహా ఇచ్చారు- డైరెక్టర్ జనరల్‌కి ముందుగానే అర్జీ పెట్టుకోమని. తన సీనియారిటీని గుర్తించి. ఈలీవ్ వేకెన్సీలో తనని ప్రమోట్ చెయ్యవలసిందిగా అర్జీపెట్టుకుంది వనజ డైరెక్టర్ జనరల్‌కి. డైరెక్టర్‌కి కాపీ పంపించింది.

గౌరీశంకర్ ఇప్పుడు ఇరకాటంలో పడ్డాడు. ఈ సమయంలో దాని మాట నెగ్గిందంటే ఇక దానికి పట్టపగ్గాలుండవు. రూలు ప్రకారం లీవ్

వేకెన్సీలో వనజకే ప్రమోషన్ రావాలని తెలుసు. కానీ, ప్రసాద్ క్వాలిఫికేషన్స్ ముందర ఈ వనజ ఎందుకు పనికొస్తుంది? ఇటువంటి పరిశోధనా సంస్థల్లో చదువు సంధ్యలూ తెలివితేటలూ ముఖ్యంకానీ, గాడిదలాగ పదేళ్ళు పని చెయ్యటం ప్రధానం కాదు. ప్రసాద్‌కే ఇవ్వాలి ఈ ప్రమోషన్-అని గౌరీ శంకర్ మనస్సు ఘోషించింది.

తన మనస్సులోని ఆరాటాన్ని తగ్గించు కోవటానికి ఇద్దరు ముగ్గురు వందిమాగధుల్ని పిలిచి సంప్రదించాడు—ఈ విషయమై. అందరికీ మనస్సులో వనజకే రావటం న్యాయం అనిపించినా, ఉన్నమాట అని డైరెక్టర్‌కి అయిష్టత కలిగించటానికి జంకి నోరెత్తలేదు. ఒకతను కొంచెం ధైర్యంచేసి, విషయాన్ని ఎంతో తేలిగ్గా కొట్టి పారేస్తున్నట్లు పోజు పెట్టి 'వెధవది రెండు నెల్లే కదండీ, ఆవిడ మొహాన్న పారేస్తేపోలే! ఎందుకొచ్చిన గొడవ' అన్నాడు. మరొకతను అడ్డొచ్చి 'అమ్మమ్మ! అలా అనుకోకోయ్! రేపొద్దున్న మరో అవకాశంవస్తే ఈ రెణ్ణెల్ల అనుభవమే ఆదుకుంటుంది సీనియారిటీలిస్టులో' అని విశదీకరించాడు. డైరెక్టర్ చిరునవ్వునవ్వాడు అతని మేధావి బుర్రని మెచ్చుకుంటూ. చివరికి మూడో అతను మరింత ఆలోచించి 'పోనీ, కొన్నాళ్లు నాన్చెయ్యండి. ఆ తరవాత వేకెన్సీ ఫిలప్ చెయ్యాల్సిన అవసరం లేదు, పని సాగిపోతోంది అని చెప్పొచ్చు' అన్నాడు.

ఈ సలహా బ్రహ్మాండంగా ఉందనుకున్నాడు డైరెక్టర్—పాము చావకుండా కర్ర విరక్కుండా! డైక్టర్ జనరల్ వచ్చేవారం అమెరికా వెడుతున్నాడు. మరో మూడు నెల్లదాకారాడు. 'ఈ వారం రోజులూ మాట్లాడక ఊరుకుంటే సరి' అనుకున్నాడు. మనస్సులో బిక్కు బిక్కుమంటూనే ఉన్నా, పైకి ఛాతీ విరుచుకున్నాడు తన తడాకా చూసుకోమన్నట్లు.

అమెరికా వెళ్లేందుకు ముందురోజు గౌరీశంకర్‌ని కలుసుకోవటానికి స్వయంగా వచ్చాడు సారథి.

గౌరీశంకర్ ఆయనకి అడుగులికి మడుగులొత్తుతూ సంస్థలో జరుగుతున్న కార్యక్రమాలన్నిటినీ చూపించాడు అన్ని సెక్షన్లలోకీ తీసుకువెళ్లి. అక్కడ పనిచేస్తున్న వాళ్లందరితో సమయోచితంగా మాట్లాడాడు సారథి. వనజని చూడగానే 'బావున్నావా వనజా' అని అప్యాయంగా అడిగాడు. గౌరీశంకర్ ముఖం అప్రసన్నంగా మరోవైపుకి తిప్పుకున్నాడు.

ఆ మర్నాడు తన టేబుల్ మీదికి వచ్చిన ఉత్తరాన్ని చూసి నిర్ఘాంత పోయాడు గౌరీశంకర్. 'శ్రీజాకబ్ సెలవు తీసుకోవటం వల్ల ఏర్పడిన ఖాళీజాగాలోకి కుమారి వనజని రూల్సుప్రకారం ప్రమోట్ చెయ్య వలసింది' అని డైరెక్టర్ జనరల్ డైరెక్టర్‌కి ఉత్తరువు జారీచేశాడు. గౌరీశంకర్ పళ్ళు పటపట నూరాడు. 'ఇల్లు అలగ్గానే పండుగైపోదు, నేనూ చూస్తాను దీని అంతేమిటో. ఇటువంటి సంస్థ స్వవిషయాల్లో కూడా డైరెక్టర్‌కి నిర్ణయాధికారం ఎందుకులేదో నేనూ తేల్చుకుంటాను మినిస్టర్‌దాకా వెడతాను. అవసరమైతే ప్రధానమంత్రి దాకా వెడతాను' అని శపథం తీసుకున్నాడు.

ఆఫీసు ఆర్డరు వనజ చేతికింకా అందక పోయినా అవార్త అప్పుడే అందరికీ చేరిపోయింది. వనజని ఆఫీసులో అందరూ అభినందించారు. గౌరీశంకర్ చూడకుండా ఒకతను రహస్యంగా అన్నాడు 'ఇప్పుడు మన గౌరీశంకర్ గారి ముఖం చూడాలి!' అని. మరొకతను లేచి ఈయనగారు తనే సర్వాధికారిననీ, సృష్టికర్తననీ అనుకుంటాడు! తనేం చేసినా -కిందవాళ్ళు నోరు మూసుకుని అనుభవించాలనుకుంటాడు! ఇప్పుడు తెలిసొస్తుంది ఎవరుకర్త! ఎవరికర్మ! ఎవరిక్రియ! అన్నాడు వెటకారంగా.

ఈలోపుగా డైరెక్టర్ పిలుస్తున్నాడని వనజకి కబురొచ్చింది. డైరెక్టర్ కోపపు మంటల్ని ఎలా తట్టుకోవాలా అని ఆలోచిస్తూ వనజ బిక్కు బిక్కు మంటూ అతని గదిలోకి వెళ్ళింది. కాని ఆమె ఎదురుచూసి నట్లుగా గౌరీశంకర్ చూపులు నిప్పులు కక్కటం లేదు. చాలా సౌమ్యంగా కనిపించాడు. కుర్చీలో కూర్చోమన్నాడు.

'వెల్! ఐమస్ట్ కంగ్రాట్యులేట్‌యూ' అన్నాడు. మరొకరన్నట్లయితే సంతోషంతో చిరునవ్వు నవ్వేదే, కాని అతని ఎదుట చిరునవ్వు నవ్వటానికి ఆమె పెదవులు నిరాకరించాయి. నమ్రతగా తలవంచుకుంది.

"ఆ చేసేదేదో అయనతో చేసేబదులు నాతోనే చేస్తే సరిపోయేది కదా!" అన్నాడు.

'ఏమిటి' అంది నిర్ఘాంతపోతూ.

ప్రమోషన్ ఆర్డర్ కాగితాన్ని అందించటానికి చెయ్యిముందుకి చాచాడు. అందుకోబోతూంటే ఆమె వేళ్ళని పట్టుకున్నాడు.

తక్షణం చెయ్యికాలినట్లుగా వెనక్కి గుంజుకుని సీటులోంచి లేచి నిలబడింది. ఆర్డర్ కాగితాన్ని తీసుకోకుండా 'యూక్రూక్' అని మనస్సులోనే బుసకొట్టి బయటికి వచ్చేసింది.

డైరెక్టర్ జనరల్ ఇచ్చిన ఆర్డరుని డైరెక్టర్ వనజకి అందజేస్తూంటే అతనిముఖం ముడుచుకు పోవటం చూసి విజయ గర్వంతో

మందస్మితంతో ఇవతలికి వస్తుందని చూస్తున్న కొలీగ్స్ వనజముఖాన్ని చూడగానే తెల్లబోయారు.

కోపంతో ఆమెముఖం కందగడ్డలా అయింది. ఉబుకుతూన్న కన్నీళ్లు కొలీగ్స్ కంట పడకుండా వనజ గబగబా క్లోక్‌రూమ్‌లోకి వెళ్లిపోయింది.

(ఈకథ 'అంతర్జాతీయ స్త్రీల సంవత్సరానికి' అంకితం)

(జ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక, 75)